


# ఎంతకి అంతే!

రావులమ్మ చాలా కాలంగా పూల వ్యాపారం చేస్తోంది. మంచి, తాజాపూలు ఆమె దగ్గర దొరుకుతాయి. అందుకనే దేవాలయం ఎదుట దుకాణం పెట్టుకుంది. భర్త అవిటితనానికి తోడు జబ్బు మనిషికావడంతో పన్నెండేళ్ల కొడుకుతోనూ ఏడేళ్ల కూతురితోనూ దేవాలయం తెరిచినప్పటి నుంచి మూసే వరకూ పూలు కట్టుకుంటూ అమ్ముతూ వుండేది. భర్తకి బువ్వ సిద్ధంగా పెట్టి తనకు యిద్దరు పిల్లలకూ యింత అన్నం కూర మూట కట్టి తెచ్చుకునేది.

మంచి పూలు దొరుకుతాయని, భర్త అవిటివాడని, పిల్లల తల్లి అని తెలిసిన వారందరూ రావులమ్మ పూల దుకాణానికే వచ్చేవారు.

ఏ కాలంలో అయినా మూర రూపాయికి అమ్మేది. పూలకి గిరాకీ పెరిగిన పండుగ రోజుల్లో కూడా అదే ధరకి అమ్మేది.

బేరం చేసేవాళ్లు 'మూర ముప్పావలాకి యివ్వవా?' అంటే 'అలాగే తీసుకోండమ్మా' అని ఏమాత్రం సందేహించకుండా 'బాబూ, అమ్మగారికి మూర పూలు కొలిచి యివ్వు. చేతిలో పని వుంది' అని కొడుకుని యిమ్మని పురమాయించేది.

వాళ్లు పావలా తక్కువకి తీసుకున్నాం కదా అని ఎక్కువ పెట్టి కొన్నవారిని వేళాకోళం చేస్తూ వెళ్లేవారు.

ఒకరోజు ఒక పిసినారి వచ్చి 'మూర ఎంత?' అని అడిగాడు.

'రూపాయి బాబుగారూ' అంది.

'ఏం అర్ధ రూపాయకి ఇవ్వవా ?' అన్నాడు. అతని ముందే రూపాయికి మూరపూలు కొన్నవాళ్లు తెలివి తక్కువ వాళ్లు అనుకుంటూ.

'అలాగే బాబూ!' అంటూ కూతుర్ని మూర పూలుకొలిచి యిమ్మంది రాములమ్మ.

ఆ పిసినారి అది తీసుకుని వెళ్లి మళ్లీ అంతలోనే వచ్చాడు 'మోసం, దగా, ఆయనకి యిచ్చినపూలలో సగమే వుంది నా పూల దండ ' అని హడావిడి చేశాడు.

జి. రామలక్ష్మి

బాలభారతి

గుంపు పోగైనారు. అదే సమయంలో ఆ వూరి న్యాయాధికారి ఆలయానికి వస్తే పిసినారి ఆయనకు తన పూల కొలత తక్కువ అని ఫిర్యాదు చేశాడు.

'రావులమ్మా! ఇలా మోసం చెయ్యవచ్చా? ' అని అడిగాడు న్యాయాధికారి.

'అయ్యా, నేను ఏం మోసం చేశానో తమరే చెప్పండి. ఎండినవి, వాడినవి, కుళ్లిపోయినవీ పూలు యిచ్చానా. నాలుగు చోట్ల తిరిగి మంచి తాజా పువ్వులు తెచ్చి, మాల కట్టి, ఏ కాలం అయినా, ప్రియం అయినా ఒక్క పైసా కూడా ఎక్కువ అడక్కుండా అదే మూర రూపాయికి అమ్ముతున్నాను. అయితే కొనేవారు గీసి గీసి బేరం చేస్తూ ముప్పావలాకి యిస్తావా, అర్ధ రూపాయకి యిస్తావా అంటే నేను ఏం చెయ్యగలను చెప్పండి.

చూస్తూ చూస్తూ బేరం వదులుకోలేను. అలా అని యిస్తే నాకు వచ్చే నష్టం భరించ లేను. నా సంపాదనలో నాలుగు నోళ్లు అన్నం తినాలి. నష్టం రాకూడదు. వ్యాపారం పోకూడదు. ఏమిటా అని ఆలోచించాను.

చివరకు మా యింటాయన ఓ ఆలోచన చెప్పాడు. 'బేరం చెయ్యకుండా నువ్వడిగిన మూర రూపాయికి కొనేవాళ్లకి నీ మూరతో కొలిచి యివ్వు. అలా కాక మూర ముప్పావలా అడిగిన వారికి చిన్న దయిన మన అబ్బాయి మూరతో కొలిచి యివ్వు. మరీ అర్ధ రూపాయికి బేరం చేసేవారికి మన అమ్మాయి బుల్లి మూరతో కొలిచి యిప్పించు. వ్యాపారమూ పోదు. మన వ్యాపారంలో నష్టమూ రాదు ' అని చెప్పాడు నా పిల్లల తండ్రి.

'అప్పటి నుంచీ అలాగే యిస్తున్నాను బాబూ! న్యాయం, అన్యాయం ధర్మప్రభువులు మీరే చెప్పండి' అంది రావులమ్మ.

అధికారి ఒక్క నిముషం ఆలోచించి 'నిజమే రాములమ్మ ఎవరికీ అన్యాయం చెయ్యడం లేదు. ఎవరు ఏ విధంగా డబ్బు యిస్తే ఆ విధంగా కొలిపించి యిస్తుంది. ఎంతకి అంతేగా మరి ?' అని నిర్ణయం చెప్పడంతో అందరూ రాములమ్మ తెలివిని అభినందిస్తూ వెళ్లిపోయారు.

